క్లుప్తంగా

నేడు పెడన కౌన్సిల్ సాధారణ సమావేశం

పెడన: పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం జరిగే ఈ సమాశంలో అజెండాలోని 21 అంశాలను పొందుపరిచామని, వాటిపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు తప్పని సరిగా హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

138 మందికి హోమియో వైద్య సేవలు



బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 138 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరంలో గుడివాడ ప్రభుత్వ గురురాజు హోమియో వైద్యశాల వైద్యులు ఆర్.లక్ష్మి, జూనియర్ డాక్టర్లు ప్రజ్ఞ, శిరీషా, మధుకిరణ్ రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి రిపోర్టులు ఇచ్చారు. రిపోర్టుల ఆధారంగా డాక్టరు లక్ష్మి పరీక్షించి మందులు సిఫార్సు చేశారు. ఎల్‌టీ గోపి షుగర్ వ్యాధిగ్రస్తులకు రక్త పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో కేంద్రం నిర్వాహకులు జల్లూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ




నాగాయితిప్ప(మోపిదేవి): విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని గ్రామ సర్పంచి గరికిపాటి వెంకటేశ్వరావు (బుల్లి) అన్నారు. మండల పరిధిలోని నాగాయితిప్ప ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు యూనిఫాం, బ్యాగ్, బూట్లు, సాక్స్ అందజేశారు. అంతకుముందు 6,7,8 తరగతి చదువుతున్న విద్యార్థులకు నోట్ బుక్స్, ఒకటో తరగతి నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు టెక్స్‌బుక్స్ అందజేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీ మాధవరావు తెలిపారు. పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు లింగం జగదీష్‌కుమార్, పాలకేంద్రం అధ్యక్షుడు పుప్పాల సతీష్‌బాబు (నాని), వెల్ఫేర్ అసిస్టెంట్ పీతా మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎం.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు గొడుగుపేట, చెమ్మనగిరిపేట, విజయవాడ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించాలని సూచించారు.

లా సెట్‌లో విద్యార్థినికి 81వ ర్యాంకు



మచిలీపట్నంటౌన్: ఏపీ లా సెట్ ఫలితాల్లో మచిలీపట్నంకు చెందిన ముబాషిరా అనే విద్యార్థిని 81వ ర్యాంకు సాధించింది. స్థానిక లేడీయాంప్లిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన ఈమె 2024 ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 966 మార్కులతో ప్రభుత్వ కళాశాలల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని పొందింది. కళాశాలలో చదివిన ముబాషిరా లా సెట్‌లో మంచి ర్యాంకును సాధించటం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ఐనంపూడి ఆనంద్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది, కళాశాల అభివృద్ధికమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

డ్రెయిన్‌లో తూడు తొలగించాలని ఆందోళన

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రులోని వన్నేరు డ్రెయిన్‌లో నుంచి తూడు, గురపడెక్క తొలగించాలని రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు బోయిన శివయ్య మాట్లాడుతూ వన్నేరు డ్రెయిన్‌లో తూడు, గురుపడెక్క నివారణ మందు పిచికారీ చేయకపోవటంతో ఇబ్బందిగా మారిందన్నారు. నీటి పారుదల సక్రమంగా జరగని కారణంగా డ్రెయిన్‌లో మోటార్లు పెట్టి పొలాలకు నీరు పెట్టుకుంటున్నట్లు పేర్కొన్నారు. తూడు దట్టంగా ఉండటంతో సాగునీరు అందటం లేదన్నారు. ఇప్పుడు తూడు నివారణ చర్యలు చేపట్టకపోతే చిన్నపాటి వర్షానికే పల్లపు పొలాలు నీట మునిగిపోతాయని తెలిపారు. దీని వల్ల తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు చెప్పినా సమస్యను పరిష్కరించటం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఏఈ ఉదయ్‌ను వివరణ కోరగా నిధులు మంజూరు కాగానే వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

స్వచ్ఛ చల్లపల్లి సేవలు స్ఫూర్తిదాయకం

జిల్లా కలెక్టర్ బాలాజీ



వర్మీ కంపోస్ట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, డీఆర్‌కే ప్రసాద్

చల్లపల్లి(అవనిగడ్డ): సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ చల్లపల్లిని స్వచ్ఛ సుందర చల్లపల్లిగా తీర్చిదిద్దిన డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్–డాక్టర్ పద్మావతి దంపతులు, స్వచ్ఛంద కార్యకర్తల సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి ద్వారా చేపట్టిన స్వచ్ఛ సుందర భవనం, వర్మీ కంపోస్ట్ కేంద్రం, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే కేంద్రాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సుందర చల్లపల్లి నిర్వాహకులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ ద్వారా చేపట్టిన స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమాలను కలెక్టర్ బాలాజీ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. గత పది సంవత్సరాలుగా జరుగుతున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి సేవలను తెలుసుకుని డీఆర్‌కే దంపతులను ఆయన అభినందించారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి సేవలు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చేలా డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్–పద్మావతి దంపతులు, స్వచ్ఛ సైనికులు పనిచేశారని శాసనసభ్యులు బుద్ధప్రసాద్ కలెక్టర్ బాలాజీకి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఒకే స్థలానికి రెండు పొజిషన్ సర్టిఫికెట్లు..

ఘంటసాల: ఒకే స్థలానికి ఇరువురికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారని, ఆ స్థలాన్ని మాకు ఇప్పించాలని ఘంటసాల మండలం దేవరకోట గ్రామానికి చెందిన కొడాలి విజయలక్ష్మి కోరింది. ఘంటసాల గ్రామానికి శుక్రవారం విచ్చేసిన కలెక్టర్ డీకే బాలాజీకి విజయలక్ష్మి వినతిపత్రం అందజేసింది. దీంతో కలెక్టర్ ఆమె నుంచి మరిన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మహిళకు హామీ ఇచ్చారు.



జిల్లా కలెక్టర్ బాలాజీకి అర్జీ ఇచ్చి మాట్లాడుతున్న విజయలక్ష్మి

జిల్లాకు మరింత మంచి పేరు తేవాలి

డీఐఈవో సాల్మన్‌రాజు

అవనిగడ్డ: ఇంటర్, టెన్త్ ఫలితాల్లో జిల్లాలో పేరు తెచ్చుకున్న అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల జిల్లాకు మరింత ఖ్యాతి తెచ్చేలా పనిచేయాలని ఇంటర్ మీడియెట్ బోర్డు జిల్లా విద్యాశాఖాధికారి సాల్మన్‌రాజు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల అధ్యాపకులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈవో సాల్మన్‌రాజు మాట్లాడుతూ గత ఐదారు సంవత్సరాల నుంచి ఉత్తీర్ణతలో జిల్లా స్థాయిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంచి పేరు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిర పడిన వారు ఉన్నారని చెప్పారు. అలాంటి వారిని ఆదర్శనీయంగా తీసుకుని చదువులో రాణించాలన్నారు. డీఈవో తాహెరా సుల్తానా మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉత్తీర్ణతలో జిల్లాలో మంచి పేరు తెచ్చుకుందని, ఈ ఏడాది మరింత పేరు తెచ్చుకునేలా పనిచేయాలన్నారు. ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా విద్యార్థులకు బోధించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా ఉపాధ్యాయులు పని చేయాలని కోరారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రేఖారాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంఈవోలు ఎన్.శివశంకరరావు, రాందాస్, పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో సాల్మన్‌రాజు

మాజీ ప్రధాని పీవీ నేటి తరానికి ఆదర్శం

మచిలీపట్నంటౌన్: బహుభాషా కోవిదుడు, భారత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పీవీ నరసింహారావు జయంతిని స్థానిక ప్రధాన పార్కు గ్రంథాలయం వద్ద ఉన్న పీవీ నరసింహారావు విగ్రహం వద్ద విగ్రహ కమిటీ ప్రధాన కార్యదర్శి పీవీ ఫణికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీవీ విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఏకైక తెలుగు ప్రధానిగా పనిచేసిన పీవీ నరసింహారావు రాష్ట్రానికి అందించిన సేవలు మరువరానివన్నారు. పీవీకి మచిలీపట్నంతో ఎంతో సత్సంబంధం ఉందన్నారు. పరిపాలనా రంగంలో సంస్కరణలకు ఆద్యుడిగా, ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా ఆయన పేరొందారన్నారు. నాడు ఆయన తీసుకువచ్చిన సంస్కరణల వల్లే భారత దేశంలో సాఫ్ట్‌వేర్ రంగం అనూహ్యంగా వృద్ధి చెంది డాలర్ల రూపంలో ఆదాయం పెరిగిందన్నారు. విదేశీ మారక ద్రవ్యం నిల్వల్లో సురక్షిత స్థాయికి చేరుకున్నామన్నారు. పీవీ ఫణికుమార్ పీవీ నరసింహారావు జీవిత విశేషాలను వివరించారు. పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, బీజేపీ సీనియర్ నాయకులు పంతం గజేంద్రరావు, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, కార్పొరేటర్ మరకాని సమతాకీర్తి, మాజీ కౌన్సిలర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, జనసేన నాయకుడు గడ్డం రాజు, వంపుగడవల చౌదరి, బీసీ సంఘ నాయకులు కేవీవీ సత్యనారాయణ, బ్రాహ్మణ సంఘం నాయకులు వేమూరి రామకృష్ణారావు, మోపర్తి సుబ్రహ్మణ్యం, ఎల్ఐసీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షుడు వేము కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పీవీ నరసింహారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించండి

- ఎంపీపీ సంగా మధుసూదనరావు
- గూడూరులో మండల పరిషత్ సర్వసభ్యసమావేశం



సమావేశంలో మాట్లాతున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు, పక్కన జెడ్పీటీసీ సురేష్

గూడూరు: అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో అధికారులు అధికారిక కార్యక్రమాలకు కనీస సమాచారం ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను విస్మరించడం సహేతుకం కాదన్నారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఏ కార్యక్రమం నిర్వహించినా స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ముందస్తుగా వారికి సమాచారం ఇవ్వడమే కాకుండా కార్యక్రమాలలో భాగస్వామ్యం కల్పించాలన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రతినిధులను విస్మరిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

సమస్యలపై విస్తృత చర్చ..

కంచాకోడూరులో నిర్మించిన రైతు భరోసా కేంద్రానికి వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైన కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచి కోళ్ల హనుమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి తీసుకెళ్లారు. లేళ్లగరువులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు పూర్తయినా వాటిని ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారాయని, భవనాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచి నరహరశెట్టి మానస ధనేష్ కోరారు. ముక్కొల్లు నుంచి గ్రామానికి సరఫరా అవుతున్న రక్షిత తాగునీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, నీటి సరఫరా పెంపుకోసం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గంగ్రంలో రక్షిత నీటి పథకం ఫిల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచి గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు కోరారు. తరకటూరులో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటులో జాప్యం జరుగుతుందని ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ ఎన్.ప్రేమాన్విత, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచండి

వ్యవసాయ శాఖ జేడీ పద్మావతి

అవనిగడ్డ: ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ ఎం.పద్మావతి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం సంబంధిత అధికారులు, ఎరువులు, విత్తనాల డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ పద్మావతి మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సాగునీటి ఎద్దడి నేపథ్యంలో వెదపద్ధతి సాగుకు ప్రాధాన్యత ఇచ్చేలా రైతులను చైతన్య పరచాలన్నారు. సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులను సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు అమ్మకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులకు వివరించాలన్నారు. వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకునేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా చూడాలన్నారు. ఏడీఏ జయప్రద అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉద్యాన శాఖాధికారి జ్యోతి, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండలాల ఏవోలు, వీఏలు, సచివాలయ అగ్రికల్చర్ సిబ్బంది, ఎరువులు, విత్తనాల డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ పద్మావతి

డయేరియా నివారణపై అవగాహన

బంటుమిల్లి: మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)వైద్యులు, సిబ్బంది ముందస్తుగా డయేరియా నివారణ చర్యలు చేపట్టాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం బంటుమిల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో డయేరియా నివారణ, అవగాహన సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్న ఈ సమావేశంలో వైద్యురాలు సౌందర్య మాట్లాడుతూ స్టాప్ డయేరియా కార్యక్రమం జూలై ఒకటవ తేదీ నుంచి 31 వరకు మండలంలో నిర్వహించాల్సి ఉందన్నారు. సిబ్బంది ఇంటింటికీ తిరిగి డయేరియాకు కారణమయ్యే విషయాలపై ప్రజలకు అవగాహన, తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించాలన్నారు. ఎంపీడీవో జీఎస్.రామకృష్ణరాజు, సీడీపీఓ ఎం.సముద్రవేణి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, మురుగునీటి వల్ల దోమలు, అంటు వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనికి అవసరమైన జింకు టాబ్లెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర మందులు పీహెచ్‌సీలతోపాటు సబ్‌సెంటర్లలోను, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల వద్ద ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీటీ శివ, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, భగవాన్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు. పెదతుమ్మిడి పీహెచ్‌సీ పరిధిలో వైద్యురాలు సువర్చల పర్యవేక్షణలో వైద్య సిబ్బంది పలు గ్రామాల్లో బ్లీచింగ్, సున్నం పిచికారి చేసి ఇండ్ల వద్ద మురుగునీరు నిలవ చేయకుండా జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం. దాసు, భారతి, కొండలరావు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



బంటుమిల్లిలో మాట్లాడుతున్న వైద్యురాలు

డయేరియా కేసులు రాకుండా చూడాలి



డాక్టర్ ప్రమోద్ కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

ఘంటసాల: గ్రామాల్లో డయేరియా కేసులు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల గ్రామానికి శుక్రవారం శయన బుద్ధ విహార్ ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్‌తో మాట్లాడారు. వాతావరణ మార్పుల దృష్ట్యా పీహెచ్‌సీ పరిధిలో డయేరియా కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తెలిపారు. స్పందించిన డాక్టర్ ప్రమోద్ కుమార్ రెండు రోజుల్లో ఎంపీడీవో ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నామని గ్రామస్థాయిలో అధికారులకు తెలియజేస్తామన్నారు. త్వరలో మరోసారి అందర్ని కలుస్తానని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మండవల్లి: మూలపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సజ్జా సురేష్ (బాబి) హెచ్‌ఎం ఎం.మార్గరెట్ ఆధ్వర్యంలో ఎన్డీఏ నాయకులు చాలసాని కోటేశ్వరరావు (కోటయ్య) ఆర్థిక సాయంతో శుక్రవారం రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.నాని, జి.గణేష్, వి.శివయ్య, పి.చంద్రశేఖరరావు, సీహెచ్‌వీ రంగారావు, డి.రంగారావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ఘంటసాల: డ్వాక్రా మహిళలు ఆరోగ్యంతో పాటు ఆదాయం సంపాదించుకోవడానికి ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని చల్లపల్లి ఏరియా కో ఆర్డినేటర్ ఎమ్.మధు అన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో ఘంటసాల మండలం ఏపీఎం బి.అమరేశ్వరరావు అధ్యక్షతన ఘంటసాల వెలుగు కార్యాలయంలో జరుగుతున్న విజయశ్రీ మండల మహిళా సమైఖ్యలో పని చేస్తున్న గ్రామైక్య సంఘాల ప్రెసిడెంట్లకు ఆహారం–పోషణ–ఆరోగ్యం–పారిశుద్ధ్యం అనే అంశాలపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీ మధు మాట్లాడుతూ శిక్షణ అంశాలను గ్రూపు సభ్యులకు తెలియజేసి ఆరోగ్యం ఉంటూ స్వయం ఉపాధి ద్వారా ఎలా ఆదాయం పొందాలో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ డి.శ్రీనివాసరావు, ఎమ్.ఝాన్సీ, సీసీ నాగేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఏసీ మధు

పీఏసీఎస్‌లో నూరుశాతం రుణ వసూళ్లు

నాగాయలంక: కేడీసీసీ బ్యాంకు నాగాయలంక బ్రాంచి పరిధిలోని బర్రంకుల పీఏసీఎస్‌లో 2023–24 సంవత్సరానికి నూరుశాతం రుణాలు వసూలు సాధించినట్లు సంఘం సీఈవో పి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సొసైటీలో 1,034 మంది రైతుల నుంచి స్వల్పకాలిక రుణాలు రూ.555.86 లక్షలు, దీర్ఘకాలిక రుణాలు రూ.273.56 లక్షలు, మొత్తంగా రూ.829.42 లక్షల రుణాలను నూరుశాతం వసూలు శుక్రవాసం నాటికి పూర్తి చేశారు. గత 14 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా ప్రతి ఏటా నూరు శాతం వసూళ్లు కొనసాగుతుందని సీఈఓ పేర్కొన్నారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాలను సిబ్బందితో కలసి ఆయన కేడీసీసీ చీఫ్ మేనేజర్ చింతలపూడి మధుబాబుకు అందజేశారు. రుణవసూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించిన సిబ్బందిని ఈ సందర్భంగా కేడీసీసీ నాగాయలంక బ్రాంచిలో జరిగిన ఒక కార్యక్రమంలో మేనేజర్ అభినందించారు. రుణ వసూళ్లలో నోడల్ అధికారి జీఎస్ ప్రకాశరావు, సూపర్‌వైజర్ రెహమున్నీసా, పాశం ఈశ్వరరావు, గోలి ఆదినారాయణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాన్ని మేనేజర్‌కు అందజేస్తున్న సీఈఓ, సిబ్బంది

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని కొత్తపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చేబ్రోలు వినయ్‌కు చెందిన ఇల్లు గురువారం అర్ధ రాత్రి పూర్తిగా దగ్ధమైంది. అవనిగడ్డ అగ్నిమాపక అధికారి ప్రసాద్ అందించిన వివరాలు ప్రకారం.. వినయ్ కుటుంబ సభ్యులు గురువారం బయటకు వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే స్థానిక అగ్నిమాపక అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రమాద స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విలువైన వస్తువులతో పాటు ఇంట్లో ఉన్న సామాన్లన్నీ అగ్నిప్రమాదంలో కాలిపోయి, కట్టుబట్టలతో మిగిలారు. విషయం తెలుసుకున్న మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి బియ్యం నిత్యావసర వస్తువులు అందించారు. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం పక్కా గృహం నిర్మించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బొంతు సురేష్ పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న దోవా గోవర్ధన్

ఆర్థిక సాయం

చల్లపల్లి(అవనిగడ్డ): స్థానిక పంచాయతీ పరిధిలోని నారాయణరావునగర్ శివారు ఎస్టీ కాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన గరికపాటి యశోదకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, జనసేన నేత మండలి వెంకట్రామ్ (రాజా) రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. జనసేన నాయకులు అడపా రాంబాబు, జనసేన కార్యకర్తలు సమకూర్చిన ఈ మొత్తాన్ని వెంకట్రామ్, బాధితురాలు యశోదకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబుతో పాటు పలువురు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మోడల్ స్కూల్ సందర్శన

చల్లపల్లి (అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని పాగోలులో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను మేనేజింగ్ ట్రస్టీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధన, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో విద్యలో రాణించాలన్నారు. విద్య ద్వారానే ఉన్నత స్థితికి చేరుకుంటారని చెప్పారు. రాష్ట్రానికే స్ఫూర్తిగా ఉండేలా మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న భువనేశ్వరి

పంట కాలువలు బాగుచేయండి

గుడివాడ టౌన్: మోటూరు చానల్ పంటకాలువ పరిస్థితి అధ్వానంగా ఉందని దానిని వెంటనే బాగుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. గుడివాడ పట్టణంతో పాటు పలు మండలాల్లోని గ్రామాలకు సాగు, తాగునీరు అందించే మోటూరు చానల్ గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలతో నిండిపోయిందని పేర్కొన్నారు. ఇక వీటికి అనుబంధ కాలువల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొందని తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వీటిని ఇప్పుడు బాగుచేయకపోతే వచ్చే ఏడాది వరకు పరిస్థితి అధ్వానంగానే మారుతుందన్నారు. ఇక డ్రాపుల పరిస్థితి దయనీయంగా మారిందని గేట్లు పగిలిపోయి నీటి కట్టడికి ఇబ్బందిగా మారాయన్నారు. ఇరిగేషన్ అధికారులు ఈ సమస్యలపై స్పందించి ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.



కాలువ పరిస్థితిని చూపిస్తున్న ఆర్‌సీపీ రెడ్డి